

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

## గూడెంలో కార్తీక పూజలు

దండేపల్లి, నవంబర్17 : దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం గుట్ట కింద భాగంలో రావి చెట్టు వద్ద, గుట్టపైన గల ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 425 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించాయి. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## లింగాపూర్ బీట్‌లో చెట్లు నరికివేత



చెట్లు నరికి వేసిన ప్రాంతం

దండేపల్లి, నవంబర్17 : మండలంలోని లింగాపూర్ బీట్‌లోని 380 కంపార్ట్‌మెంట్‌లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు 100 చెట్లు, పొదలను నరికారు. ఆదివారం ఉదయం 20 మంది చెట్లు నరుకుతున్నారని సమాచారం అందడంతో అటవీ అధికారులు అక్కడికి వెళ్లి చూడగా, అప్పటికే వారు పారిపోయారు. ఈ విషయమై తాళ్లపేట రేంజర్ సుష్మారావును వివరణ కోరగా.. లింగాపూర్ బీట్‌లో చెట్ల పొదలు నరికిన మాట వాస్తవమేనన్నారు. ఈ విషయమై బీట్ సమీపంలోని దమ్మన్నపేట, మామిడిగూడెం వాసులకు కౌన్సెలింగ్ ఇచ్చి అవగాహన కల్పిస్తామన్నారు. కాగా, పోడు కోసమే చెట్లు నరికివేసినట్లు తెలుస్తున్నది.



కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన ఫజల్‌ను అభినందిస్తున్న రాష్ట్ర కో ఆర్డినేటర్ కంటేశ్వర్

## కాగజ్‌నగర్‌లో జాతీయ స్థాయి కరాటే పోటీలు

కాగజ్‌నగర్, నవంబర్ 17: పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 1100 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక ఎక్సెల్ స్కూల్ విద్యార్థి శేక్ ఫజల్ ప్రతిభకనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే రాష్ట్ర కో ఆర్డినేటర్ కంటేశ్వర్, నిర్వాహకుడు కుకుడే సంతోశ్ పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ



సిరిశెట్టి సత్యనారాయణ

బెల్లంపల్లి, నవంబర్ 17 : టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా బెల్లంపల్లి పట్టణంలోని ఏరియా వర్క్‌షాప్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న సిరిశెట్టి సత్యనారాయణ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు. తనను నియమించిన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ, ఏరియా కమిటీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# సింగరేణి ఏరియా దవాఖానపై పట్టింపేది?



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఏసీ

- ఏ చిన్న రోగమొచ్చినా ఇతర ప్రాంతాలకు రెఫర్
- వేధిస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సుల కొరత
- కార్మికులకు అందని ద్రాక్షగా సేవలు
- శిథిలావస్థలో హాస్పిటల్ భవనం
- ఇప్పటికే రెండుసార్లు షార్ట్ సర్క్యూట్
- పెద్ద ప్రమాదాలతోనే మేల్కొంటారా.. అని ప్రశ్నిస్తున్న స్థానికులు
- కన్నెత్తి చూడని ఎమ్మెల్యే వినోద్




బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖాన

**ఇప్పటికే వార్డుల కుదింపు**



బెల్లంపల్లి, నవంబర్ 15 : బెల్లంపల్లి ఏరియా దవాఖానపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సింగరేణి యాజమాన్యం పట్టించుకోకపోడంతో కార్మికులు, వారి కుటుంబాలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మారుతున్నాయి. ఇప్పటికే వార్డులను కుదించిన అధికారులు.. దీని నిర్వహణను కూడా గాలికొదిలేయగా, నిత్యం విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రెండు నెలల క్రితం క్యాజువాలిటీ విభాగంలో షార్ట్ సర్క్యూట్ జరగగా, తాజాగా గురువారం వైద్యుల విశ్రాంతి గదిలో మంటలు చెలరేగడం కలకలం రేపింది. దవాఖానపై యాజమాన్యం ఉదాసీన వైఖరితో కార్మికులు, వారి కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### రెఫర్ టు బీ-జోన్, గోదావరిఖని

బెల్లంపల్లి ఏరియా దవాఖానకు ఏ చిన్న రోగం, నొప్పితో వచ్చినా ఇక్కడి వైద్యులు వెంటనే బీ-జోన్, గోదావరిఖని ఏరియా దవాఖానాలకు రెఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో 250 పడకలతో ఉన్న ఈ దవాఖానలో కేవలం క్యాజువాలిటీ వార్డులతోనే సరిపెడుతున్నారంటే వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రత్యేక వైద్యులు, ఇతర వైద్యులు కొరత ఉండడంతో కార్మికులు ఇక్కడికి రావడం లేదని తెలుస్తోంది. గైనకాలజిస్ట్, అనస్థేసియా, రేడియోలజిస్ట్, ఆర్థో సర్జన్, హెల్త్ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గైనకాలజిస్ట్ స్థానికంగా ఉన్నా పక్షం రోజుల నుంచి విధులకు హాజరు కావడం లేదు. ఎంబీబీఎస్ వైద్యులు 10 మంది ఉండాల్సి ఉండగా, ఆరుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. స్టాఫ్ నర్సులు 25 మందికిగాను 16 మంది మాత్రమే ఉన్నారు. దీంతో కార్మికులకు వైద్య సేవలు అందడం లేదు. ఈ నేపథ్యంలో వార్డులు కూడా బోసిపోయి ఉంటున్నాయి.



రోగులు లేక వెలవెలబోతున్న వార్డు

### రెండుసార్లు షార్ట్ సర్క్యూట్

బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖాన 1986లో ప్రారంభమైంది. దశాబ్దాల కాలం నాటి భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకున్నది. భవనం పై కప్పు పెచ్చులూడుతున్నాయి. కిటికీలు పాడైపోయాయి. భవనం స్లాబ్ నుంచి వర్షపు నీరు గోడల్లోకి వెళ్లి షార్ట్ సర్క్యూట్‌కు కారణమవుతున్నది. రెండు నెలల క్రితం క్యాజువాలిటీలో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. వెంటనే వైద్యం పొందుతున్న రోగులను అక్కడి నుంచి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. తాజాగా.. గురువారం (ఈ నెల 14న) వైద్యుల విశ్రాంతి గదిలో ఏసీ పరికరానికి షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. సూపరింటెండెంట్ మధుకర్ అప్రమత్తమై మెయిన్ ఆఫ్ చేయడం, ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించడంతో పెద్దగా ప్రమాదమేమీ జరగలేదు.

### ఎందుకింతా నిర్లక్ష్యం...

శిథిలావస్థ భవనానికి మరమ్మతులు చేయించడంలో సింగరేణి యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందని ఆరోపణలున్నాయి. కాలం చెల్లిన విద్యుత్ వైర్ల స్థానంలో నూతన వైరింగ్ అమర్చాల్సి ఉండగా, పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా పెద్దప్రమాదం జరిగితేనే యాజమాన్యం స్పందిస్తుందా అని స్థానికులు మండి పడుతున్నారు. దవాఖానలో స్విచ్ బోర్డుల వద్ద ఎక్కడా చూసినా తెగిపోయినా, వేలాడిన విద్యుత్ వైర్లు కనిపిస్తాయని కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### పూర్వవైభవం హామీ ఏమైంది ఎమ్మెల్యే ?

సింగరేణి ఏరియా దవాఖాన పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దవాఖానను రక్షించాలని కోరుతూ నాయకులు ఈ ఏడాది ఆగస్టులో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ దవాఖానను సందర్శించారు. సీఎంవోను పిలిపించి దవాఖాన సమస్యలపై సమీక్ష కూడా నిర్వహించారు. సెప్టెంబర్ 30 లోగా దవాఖానకు పూర్వ వైభవం తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కానీ, ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని పరిరక్షణ కమిటీ నాయకులు మండి పడుతున్నారు. కనీసం దవాఖాన వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింగరేణికే తలమానికం అయిన బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రం నడిబొడ్డున ఉన్న దవాఖాననే పట్టించుకోకుండా ఉన్నా ఎమ్మెల్యే ఇంకేం అభివృద్ధి చేస్తారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.



కొత్తగా ఏసీ అమర్చి కనెక్షన్ ఇవ్వకుండా స్విచ్ బోర్డులకు ప్లాస్టర్లు వేసిన దృశ్యం



రోడ్డు పక్కనే పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

# దళారుల దోపిడీ

**పల్లెల్లో ఇష్టారాజ్యంగా పత్తి కొనుగోళ్లు**

- ధర తగ్గించడమేగాక క్వింటాలుకు ఐదు నుంచి పది కిలోల కోత
- సీసీఐ నిర్ణయించిన ధరకు రూ. 1500 తక్కువ చేసి కొంటున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ) : జిల్లాలో సీసీఐ పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించకపోవడం దళారులకు వరంగా మారుతున్నది. పల్లెల్లో ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు తెరచి తక్కువ ధరకు దూది కొంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తుండగా, యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నది.

### వ్యాపారులు చెప్పిందే ధర..

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు తెలుస్తుండగా, 23 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని యంత్రాంగం అంచనా వేస్తున్నది. ప్రభుత్వం ద్వారా జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 14 జిన్నింగ్‌ల మిల్లులు ఉన్నప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తున్నది. వ్యాపారులు తాము చెప్పిందే రేటు.. అన్నట్లుగా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. సీసీఐ నిర్ణయించిన ధర క్వింటాలుకు రూ. 7521 ఉంటే.. వ్యాపారులు రూ. 6 వేల నుంచి రూ. 6500 వరకు మాత్రమే చెల్లించి కొంటున్నారు. దీంతో రైతులు రూ. వెయ్యి నుంచి రూ. 1500 వరకు నష్టపోతున్నారు. పత్తి అమ్మిన రైతులకు వ్యాపారులు అప్పటికప్పుడే డబ్బులు చెల్లిస్తుండడంతో వారంతా ఆసక్తి చూపుతున్నారు.

### ఏజెన్సీ మండలాల్లో..

జిల్లాలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేని ఏజెన్సీ మండలాలైన లింగాపూర్, సిర్పూర్-యూ, కెరమెరి, తిర్యాణిలలో దళారులు నేరుగా రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు సాగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు జిన్నింగ్‌లలో 4 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తే.. బయట వ్యాపారులు మాత్రం 40 వేల క్వింటాళ్లకు పైగా పత్తిని కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. ఒకటీ.. రెండు ఎకరాల్లో పత్తి సాగు చేసే రైతులు తాము పండించిన పత్తిని దూరంలో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తరలించలేక దళారులకు విక్రయించక తప్పడం లేదు. రైతుల పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వ్యాపారులు ఇష్టారీతిలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ధరలను తగ్గించడమేగాక క్వింటాలుకు ఐదు నుంచి పది కిలోల మేరకు కోత విధిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దళారుల ఆగడాలను అరికట్టేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిన్నింగ్‌లలో కొనుగోళ్లను వ్యూహాత్మకంగానే ఆలస్యం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్ద పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

# గ్రూప్-3 ప్రశాంతం

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే**

నస్పూర్,నవంబర్ 17 : మంచిర్యాల జిల్లాలో మొదటి రోజు గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రతిభ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 15038 మంది అభ్యర్థులకుగాను 8246 మంది హాజరయ్యారన్నారు. పరీక్ష నోడల్ అధికారి, పోలీసు నోడల్ అధికారి, రీజియన్ కో ఆర్డినేటర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, వైద్య సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. హాల్ టికెట్ వెరిఫికేషన్ కోసం మహిళా సిబ్బందిని నియమించామన్నారు. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపరు-3 పరీక్ష ఉంటుందన్నారు. కాగా, కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు.

### ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ టౌన్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/కాగజ్‌నగర్,నవంబర్ 17 : జిల్లాలో మొదటి రోజు గ్రూప్-3 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సాగాయి. 18 కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 4471 మందికి అభ్యర్థులకుగాను 2794 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో పేపర్లో 4471 మందికిగాను 2779 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల, పీటీజీ గురుకుల పాఠశాలలు, కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెటీ, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సందర్శించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన పరీక్షా పత్రాలు, ఓఎంఆర్ షీట్లను కేంద్రాలకు తరలించే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్, నోడల్ అధికారి దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహా ఉన్నారు.

### ఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు

జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లను ఆయన పరిశీలించారు. అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించకూడదని తెలిపారు.



మంచిర్యాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



ఆసిఫాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



మంచిర్యాలలో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



మంచిర్యాలలో దివ్యాంగ అభ్యర్థికి సాయం చేస్తున్న పోలీస్




మంచిర్యాలలో పరీక్ష కేంద్రం గేటు వేయడంతో బయటే ఉన్న అభ్యర్థులు